# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!





## కాంగ్రెస్ వస్తే మళ్లీ కరెంటు కష్టాలే..

సిర్పూర్(టీ), నవంబర్ 28 : కాంగ్రెస్ వస్తే మళ్లీ పాత రోజులే వస్తయి. అప్పటి కష్టాలు మళ్లీ రైతులకు తప్పవు.. గత పాలనలో రోజుకు రెండు, మూడు గంటలే కరెంట్ వచ్చేది.. అది కుడా ఎప్పుడు వస్తుందో, పోతుండేనో తెల్వకపోతుండే.. తెలంగాణ వచ్చినంక తొమ్మిందేండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు 24 గంటల కరెంట్ ఇస్తుంది. దీంతో మేం ఎప్పుడంటే అప్పుడు పోలానికి వెళ్లి నీళ్లు పెట్టుకుంటున్నం. రైతులకు కరెంట్ కష్టాలు లేకుండా కేసీఆర్ చేశారు. పంట పెట్టుబడి సాయం , రైతు బీమా, సబ్సిడీ ఎరువులు, విత్తనాలు సకాలంలో ఇస్తండు. ముఖ్యంగా ఎవుసానికి 24 గంటలు కరెంట్ ఇవ్వడంతో మూడు పంటలు మంచిగ పండుతున్నయి. రైతులంతా సంతోషంగా ఉన్నరు. ఎవుసానికి 24 గంటల కరెంట్ వద్దు, మూడు గంటలు చాలు అని కాంగ్రెస్ అంటున్నది. వాళ్లకు ఏమైనా ధిమాక్ ఉన్నదా.. మూడు గంటల కరెంట్‌తో మూడు పంటలు పండుతయా.. ఇలా రైతులపై రాజకీయం చేసే కాంగ్రెస్ నాయకులకు సిగ్గుండాలె. మళ్ల 10 హెచ్‌పీ మోటర్ పెట్టుకోవాలని నాయకులు అంటున్నరు. అన్ని పైసలు మాకాడ ఉంటయా.. 10 హెచ్‌పీ మోటరుతో బోరు పైపులు ఉంటయా..కాంగ్రెసోళ్ల మాటలు ఎప్పటికి నమ్మం. వాళ్ల పాలన వద్దే వద్దు. రైతులను ఆదుకునే కేసీఆర్‌సారునే మళ్లీ గెలిపించుకుంటం.

**- మారుతి కిర్మరే, హుడ్కులీ**



## ధరణి వచ్చింది గొడవలు పోయాయి..

వాంకిడి,నవంబర్28 : ధరణి పోర్టల్‌తో రెవెన్యూ రికార్డులు భద్రంగా ఉన్నాయి. గతంలో పటేల్,పట్వారీ వ్యవస్థ ఉన్నప్పుడు ఎవరి భూములను ఎవరికి రాశారో తెలియదు. పట్టాల కోసం పట్వారి చుట్టూ, ఆఫీసుల చుట్టూ తిరిగినా భూమి పట్టా కాకపోతుండే. భూమి పట్టా కావాలంటే లంచాలు ఇవ్వంది పని కాకపోతుండే. మన భూమి మన పేరున ఉందో లేదో తెల్వక పోతుండే. ఒక వేళ తెలుసుకోవాలంటే పట్వారీకి ఊడిగం చేయాల్సి వచ్చేది. ఒక ఎకరం పట్టా భూమి పేరు కాస్తులో ఒకరు, పట్టాలో ఒకరు ఉండడంతో ఆ ఇద్దరి మధ్య గొడవలు జరిగేవి. కాంగ్రెసోళ్ల పాలనలో రాత్రికి రాత్రే ఒకరి పేరుమీద ఉన్న భూమిని మరోకరి పేరున చేసేటోళ్లు. ధరణి వచ్చాక అటువంటి సమస్యలేవి లేవు. ఒక వ్యక్తికి ఒకే పాస్ పుస్తకం ఇచ్చారు. ఒక రోజుల్లోనే భూమి అమ్మాలన్నా... కొనాలన్న స్లాట్ బుక్ చేసిన ఒక్కరోజులోనే రిజిస్ట్రేషన్, మ్యూటివేషన్ జరుగుతున్నవి. ధరణిని రద్దు చేస్తే మళ్లీ పాత రోజులే వస్తాయి. గ్రామాల్లో గొడవలు పెరుగుతాయి. కాంగ్రెసోళ్లు చేప్పే మాటలు నమ్మి మోసపోం. కేసీఆర్ సర్కారే మళ్లీ రావాలి. మా ఓటు కారు గుర్తుకే.

**- సెండే దొడజి రైతు,బంబార**

# దళారులదే రాజ్యమైతది..

- ధరణి తీసేస్తే రైతుల బతుకులు ఆగమే..
- కాంగ్రెసోళ్లవి నీతిలేని రాజకీయాలు
- వారి కుట్రలు బయటపెడుతున్నరు
- బీఆర్ఎస్‌తోనే ప్రగతి అని రైతుల అభిప్రాయం

**'సీఎం కేసీఆర్ తీసుకొచ్చిన ధరణి పోర్టల్ తో రైతులకు భూ రికార్డుల సమస్యలు తీరినయ్. ఆన్‌లైన్‌లో మా భూములు భద్రంగా ఉన్నయ్. భూమి అమ్మకాలు, కొనుగోళ్లు ఆఫీస్‌లో సులభంగా జరుగుతానయ్. దళారులు లేరు, మధ్యవర్తులు లేరు. రైతులు వేలిముద్ర పెడితే తప్ప భూ రికార్డులు మార్చే అవకాశం ఎవరికీ లేదు. అలాంటిది కాంగ్రెస్ వస్తే ధరణి తీసేస్తామని అంటాన్రు. అది తీసేస్తే రైతులకు మళ్లా మునుపటి ఇబ్బందులే వస్తయ్. పాత రెవెన్యూ విధానంతో రికార్డులు తారుమారు అయ్యే ప్రమాదం ఉంటది. భూ రికార్డుల సమస్యలతో గ్రామాల్లో రైతుల నడుమ గొడవలు అయితయ్. పనుల కోసం ఆఫీస్‌ల చుట్టూ తిరుగుడైతది. దళారులదే రాజ్యమైతది. ధరణితో భూ రికార్డుల సమస్యలు లేకుండా ప్రశాంతంగా ఉన్న రైతులను ముంచేందుకు కాంగ్రెస్ కుట్రలు చేత్తాంది.. అని రైతులు అంటున్నరు. కాంగ్రెస్ నాయకుల తీరుపై మండిపడుతున్నరు.**

## 10 హెచ్‌పీ మోటర్లను చూడలే...



సిర్పూర్(టీ), నవంబర్ 28 : కాంగ్రెస్ నాయకులు ఎవుసానికి మూడు గంటలు కరెంట్ ఇస్తామంటున్నరు. ఇదేంటని అడిగితే ..మళ్లీ 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలని అంటున్నరు. మరీ అంతపెద్ద హెచ్‌పీ మోటర్‌ను కొనుక్కోనే ఆర్థిక స్తోమత మా దగ్గర లేదు. గతంలో అలాంటి మోటర్‌ను మేం ఏప్పుడు చూడలేదు. వ్యవసాయానికి కరెంట్ సరఫరా చేయడంలో కాంగ్రెసోళ్లకు చిత్తశుద్ధి ఉండదు. గత కాంగ్రెస్ పాలనలో కరెంట్ బాధలు అన్ని ఇన్ని కాదు. ఎప్పుడు కరెంట్ వస్తదో, ఎప్పుడు పోతదో తెలువకుండే. ఇంటికి, చేనుకాడికి తిరుగుతు ఉండేది. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత కరెంట్ మంచిగున్నది. పగటి పుటనే పంటలకు నీటి తడి పట్టిస్తున్నం. కరెంట్ సమస్యలే ఏ మాత్రం లేవు. మళ్లా సీఎం కేసీఆర్ సారునే గెలిపించుకుంటం.

**- చౌదరి సాయినాథ్, హుడ్కులీ**



## ఆ బాధలు ఇంకా కండ్లముందే ఉన్నయి..

సిర్పూర్(టీ), నవంబర్ 28 : కాంగ్రెస్ పాలనలో కరెంట్ కష్టాలు అన్ని ఇన్ని కావు. ఏనాడు కంటి నిండా నిద్ర పోలేదు. కరెంట్ కోసం రాత్రంతా జాగారం చేసేవాళ్లం. రాత్రిళ్లు పోలాల దగ్గరకు వెళ్తే పాములు, తేళ్లు కుట్టేవి. కరెంట్ షాకులతో ఎంతోమంది రైతులు చనిపోయారు. ఆ బాధలు మళ్లీ ఇప్పుడు రావొద్దు. తెలంగాణ ప్రభుత్వం వచ్చినంకనే ఆ బాధలు తీరినయి. 24 గంటలు కరెంట్ ఫ్రీగా ఇస్తున్నారు. ఎప్పుడంటే అప్పుడు పోలానికి పోయి నీళ్లు పెట్టుకుంటున్నం. రాత్రిపుట పోలాల్లో పడుకునే బాధలు పోయినయి. ఇప్పుడు కాంగ్రెస్ సాగుకు 24 గంటలు ఎందుకు ..మూడు గంటలు చాలు అంటుంది..ఎట్ల సరిపోతది..వాళ్లు ఎప్పుడన్న ఎవుసం చేసిన్లా.. మూడు గంటల కరెంట్‌తో ఎన్ని ఎకరాలు పారుతది.. మళ్లా ఆ మూడు గంటల కరెంట్ ఎప్పుడు ఇస్తరో, ఎప్పుడు పోతదో ఎవ్వరికి తెలియదు. పంటలు ఎండిపోయి రైతులు నష్ట పోతరు. అలాగే మూడు గంటల కరెంట్‌తో ఒకేసారి రైతులందరూ మోటరు ఆన్ చేయడంతో వోల్టేజీ తక్కువ వచ్చి మోటర్లు కాలిపోతయి. ఇవన్నీ ఆలోచించే మాట్లాడుతున్నరా.. సిగ్గుండాలే రైతులకు మూడు గంటల కరెంట్ చాలే కాంగ్రెస్ నాయకులకు. 24 గంటల కరెంట్ ఇచ్చే పార్టీనే మాకు కావాలి. మళ్లా కేసీఆర్ సారునే ముఖ్యమంత్రిని చేసుకుంటం.

**- కిర్మరే దౌలత్ , హుడ్కులీ**

## 24 గంటల కరెంటు రైతుకు ఊపిరి



వాంకిడి,నవంబర్28 : సీఎం కేసీఆర్ వ్యవసాయానికి కరెంటు సమృద్ధిగా ఇస్తున్నారు. కాంగ్రెస్ నాయకులు చెప్పినట్టు మూడు గంటల కరెంటు సరిపోదు. కాంగ్రెస్ పాలన వస్తే అంధకారం తప్పదు. గతంలో కాంగ్రెస్ పాలనలో రైతులు అవస్థలు పడ్డారు. అప్పట్లో ఎన్నోసార్లు కరెంటు కోసం సబ్‌స్టేషన్లను ముట్టడించాం. వచ్చీరాని కరెంటుతో మోటర్లు కాలిపోయేవి. రిపేర్ చేయించడం వల్ల రైతులపై ఆర్థికభారం పడేది. నీరు అందక పంటలు ఎండిపోయేవి. రైతులు తీవ్రంగా నష్టపోయారు. కాంగ్రెస్ నాయకుల మాటలను నమ్మొద్దు. వ్యవసాయానికి 24గంటల కరెంటుతో ఎంతో మేలు జరుగుతున్నది. పంటలకు నీరు అందించేందుకు ఏ సమయంలోనైనా రైతులు మోటర్లు పెట్టుకుంటున్నారు. రైతులు ఆలోచించి రైతు ప్రభూత్వానికి అండగా నిలవాలి. కరెంటు మూడు గంటలు ఇస్తున్న కాంగ్రెస్‌ను నమ్మరు. గన్నేండ్ల పాలనలో రైతుల కోసం కాంగ్రెస్ చేసిందేమి లేదు. కాంగ్రెస్ వచ్చేది లేదు. సచ్చేది లేదు. కరెంటుపై ఆ పార్టీ నాయకుల మాటలు అర్థరహితం. రైతుల కోసం ఎంతో మేలు చేస్తున్న సీఎం కేసీఆర్ సారునే మళ్లా గెలిపించుకుంటం.

**- సోయం దేవ్‌రావు,రైతు,బంబార గ్రామం**

## కాంగ్రెస్ వస్తే రైతులకు కష్టాలే



వాంకిడి,నవంబర్ 28: గత 40ఏండ్ల నుంచి నేను వ్యవసాయం చేస్తున్నా. గతంలో నీళ్లు లేక పంటలు ఎండిపోయేది. కరెంటు ఎప్పుడు వస్తుదో ఎప్పుడు పోతదో తెలువని పరిస్థితి ఉండేది. రాత్రి పూట కరెంటు పెట్టబోయి రైతులు కరెంటు షాకులతోటి, పాములు కుట్టి ఎందోరో చనిపోయిండ్లు. విత్తనాలు, ఎరువులు దొరకక లైన్ల నిలబడి ఎన్నో ఇబ్బందులు పడ్డం. కానీ తెలంగాణ వచ్చినంక ముఖ్యమంత్రి కేసీఆర్ ఉచితంగా 24 గంటల కరెంటు ఇచ్చి, కుమ్రం భీం అడ ప్రాజెక్ట్ నుంచి నీళ్లను తెచ్చి చెరువులు నింపడంతో పంటలు బాగా పండుతున్నయ్. రైతుబంధుతో పెట్టుబడికి ఎకరాకు రూ.10 వేలు ఇచ్చి ఆదుకున్నడు. రైతు బీమాతో బాధిత కుటుంబాలకు వారం రోజుల్లోపే రూ.5లక్షలు ఇచ్చి భరోసా ఇచ్చిండు. కాంగ్రెస్ వస్తే 60ఏండ్లు ఎనుకకు పోవాల్సిందే. రైతులకు మూడు గంటల కరెంటు ఇస్తరు. మళ్లా ఆత్మహత్యలే శరణ్యం. పంటలు ఎండి రాత్రివేళల్లో కరెంటు పెట్టబోయి ప్రమాదాలకు గురై ఇబ్బందులు పడాల్సిందే. రైతులు కాంగ్రెస్‌ని నమ్మరు. మళ్లా కేసీఆర్ గెలిస్తేనే రైతులు బాగుపడుతరు. మా ఓటుకేసీఆర్ సారుకే.

**- ఎస్.మారు,రైతు,బంబార గ్రామం**

## బీఆర్ఎస్‌తోనే రైతులకు మేలు



వాంకిడి,నవంబర్28: గత పాలకుల వల్ల అష్టాకష్టాలు పడ్డ రైతులు తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎంతో ఊరట చెందారు. పంటలకు మూడు గంటలు కరెంట్ వద్దు, 24గంటలు కరెంట్ ఇచ్చే బీఆర్ఎస్ ప్రభుత్వమే కావాలి. బీఆర్ఎస్ ప్రభుత్వమే రావాలి. నేను రెండున్నర ఎకరాల్లో మిర్చి తోట వేశాను. కావాల్సినప్పుడల్లా తోటకు నీళ్లు కట్టి మంచిగా సాగు చేసుకుంటున్నాను. మాకు ఉచిత కరెంట్ ఇవ్వడంతో మేమంతా సంతోషంగా ఉన్నాం. కాంగ్రెస్ ప్రభుత్వంలో మేంపడ్డ కష్టాలు చాలు ..మళ్లీ ఆ నరకంలోకి వెళ్లలేం. బీఆర్ఎస్ వెంటే ఉంటాం.

**- బెండారే సోమయ్య రైతు, బంబార గ్రామం**

## ధరణి తీసేస్తే రైతులకు అరిగోసే..



వాంకిడి,నవంబర్28: రైతులు భూ సమస్యలపై రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగకుండా సీఎం కేసీఆర్ ధరణి పోర్టల్‌ను తీసుకొచ్చి మేలు చేశారు. గతంలో అధికారుల చుట్టూ తిరగలేక విసుగొచ్చేది. ఇప్పుడు భూమి కొనడం, అమ్మడం ఇట్టే జరుగుతున్నది. కాంగ్రెస్‌సోళ్లు ధరణి తీసేస్తాం అంటున్నారు.మళ్లీ పాత పద్ధతి వస్తే ఇబ్బందవుతుంది. ఎనుకటి లెక్క చేతితో రాసే పట్టాలయితే అవకతవకలు జరుగుతయి.మేమంతా బీఆర్ఎస్‌కే ఓట్లేస్తాం,కేసీఆర్ సార్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేస్తాం.

**– తొడసం సుంగు రైతు , జి.కొసారా గ్రామం**